

# రాళ్ళైన వాళ్ళు

సియస్.రావు

రాత్రి తొమ్మిది గంటలకి హైదరాబాద్ నుండి బయలుదేరిన బస్సు తెలతెలవారే సమయానికి ఆలమూరు బ్రిడ్జిని సమీపిస్తోంది. రాత్రంతా వాన కురియడంతో, రోడ్డంతా కడిగిన నాప రాయిలా నల్లగా నున్నగా మెరుస్తోంది. ఆకాశం నిర్మలంగా వుంది. తూర్పు దిగంతం ఎర్రని బింబాన్ని అప్పుడే ప్రసవిస్తోంది.

విండోపక్క సీటులో వున్న ప్రసాదరావు ఒక్కసారి వళ్లు విరుచుకొని కళ్ళు తెరిచాడు. కనుచూపు మేరవరకు చిరుగాలితో ఆడుకుంటూన్న పచ్చని వరిచేలు, చేల మధ్యలో అక్కడక్కడ తాటాకు పాకలు, ఎగురుతోన్న పక్షులు అగుపించాయతనికి. విశాలమైన ఆ వరిచేలలో అక్కడక్కడ గుబురుగా పెరిగిన మామిడి చెట్లు, ధ్వజాల్లా నిలబడిన తాటిచెట్లు

హుందాగా తలలూపుతున్న కొబ్బరిచెట్లు ఆ వరిచేలకి అలంకారాలుగా వున్నాయి.

దాదాపు ఆయాదేళ్ళ క్రితం, గోదావరి మీద రోడ్‌బ్రిడ్జికట్టే రోజుల్లో ప్రసాదరావు యింజనీర్‌గా పని చేశాడు. ఆ ప్రాంతం అంతా అతనికి సుపరిచితం. పరిచయమున్న ప్రాంతానికి అయిదేళ్ళ తర్వాత రావడంతో ఎందుకో అతనికి చూపినకొద్దీ చూడాలనిపిస్తోంది.

విండో డోర్ ఎత్తాడు ప్రసాదరావు. చలిగాలి కిటికీలోంచి రివ్వున వీచింది. పక్కనున్న తను, వెనుక సీటులో కూర్చున్న అమ్మాయి యిబ్బందిగా చూశారతన్ని. గాలి అతని కళ్ళకి సూదుల్లా వచ్చి తాకింది. అయినా, కళ్ళు చిట్లించి పరకాయించి చూస్తున్నాడు ప్రసాదరావు. బస్సు టాప్‌గేర్‌లో కష్టం మీద బ్రిడ్జి నెక్కుతోంది. ఆ బ్రిడ్జి అంటే ప్రసాదరావుకి వెర్రి అభిమానం. ఆ ప్రాంతం అంటే అతనికి వచ్చే యిష్టం. ఎదుటినుంచి రెండెడ్ల బళ్లు రావడంతో, ఆ బళ్ళకు దారి ఇవ్వడంకోసం బస్సు రోడ్డు ప్రక్కకి తప్పుకోవలసి వచ్చింది. దాంతో చక్రాలు రోడ్డుప్రక్కనున్న నానిన పోత మట్టిలో దిగబడిపోయాయి.

డ్రైవర్ బస్సును రోడ్డెక్కించడానికి తాపత్రయపడ్డాడు. లాభం లేకపోగా ఏదో రాడ్ విరిగిన శబ్దం వచ్చింది.

"దిగండి సార్! యిదిప్పుడింక కదలదు మరో బస్సేదైనా వస్తే ఎక్కుదురుగాని" అన్నాడు డ్రైవర్.

జనం అంతా దిగేసారు. మరో బస్సు కోసం ఎదురుచూస్తున్నారంతా. ప్రసాదరావు అందరితోబాటూ దిగాడు. తను కట్టించిన బ్రిడ్జిని ఆప్యాయంగా చూస్తూ బ్రిడ్జిమీద నడిచాడు. కొంతదూరం బ్రిడ్జి మీదకి నడిచి చుట్టూచూసాడు. బ్రిడ్జి అడుగు నుంచి ప్రవహిస్తున్న గోదావరి ఆవలి గట్టు నుంచి యీవల గట్టు వరకు గోదావరికి అడ్డుగా నిలిచిన ఆ బ్రిడ్జి స్తంభాలు చిత్రంగ అగుపించాయి.

బ్రిడ్జి అడుగునుంచి ప్రవహిస్తున్న గోదావరి 'నువ్వే గెలిచావ్. అందుకే నీ కాళ్ళకిందనుంచి తలవంచుకొని ప్రవహిస్తున్నాను' అన్నట్టు అగుపించింది ప్రసాదరావుకి. ఆవలి ఒడ్డునున్న ఇసుక తిన్నెలను పరికించాడు. నిర్మానుష్యంగా వున్నాయి. ఉన్నట్టుండి ఒక్కసారి గతం అంతా అతని కళ్ళముందు కదిలింది ... ఆ యిసుకతిన్నెలమీద, బ్రిడ్జి కట్టేరోజుల్లో అక్కడ వెలిసిన టెంట్స్, కూలీజనం, పిల్లర్స్ దింపే హడావిడి, యింజన్లు ఏవి ఉంటో అతని కళ్ళకు కట్టినట్టనిపించింది.

'ప్రతి మనిషి జీవితంలోను ఎన్నో సంఘటనలు జరుగుతాయి. కాలం గడిచే కొద్దీ మరిచిపోతాడు. కాని కొన్ని సంఘటనలు మాత్రం హృదయానికి హత్తుకుపోతాయి, చెరగని ముద్రల్లా నిలిచిపో

తాయి' అనుకున్నాడు ప్రసాదరావు. అక్కడ తను పనిచేసే రోజుల్లో జరిగిన కొన్ని సంఘటనలు, ఆ స్థలం వదిలి అయిదేళ్ళయినా అప్పుడప్పు డతన్ని వేటాడుతూనే వుంటాయి.

ఆ వేళ కంట్రాక్టర్ గజపతిరావు తన టెంట్‌లోంచి బయట కొచ్చి, హుందాగా నిలబడి జరుగుతోన్న పనిని చూస్తున్నాడు. ఓ కూలీ వచ్చి 'అయ్యగారు తవర్ని రా మంటన్నారండి' అన్నాడు ప్రసాదరావుతో. ప్రసాదరావు గజపతి దగ్గర కెడుతూ గజ పతిని పరిశీలనగా చూసాడు.

నల్లని ఆఫ్ బూటుమీద పాలతరగలా ఆడుకుంటూన్న పిల్కులాల్చీ, ఒత్తయిన కనుబొమ్మలు, బలిసిన గంభీరమైన ముఖం అహంతో నిండిన నిర్లక్ష్యమైన చూపులు చూసేసరికి ప్రసాదరావుకు గజపతి 'నే నీ ప్రపంచంలో కొనలేనిదంటూ ఏదీలేదన్నట్టు అగుపించాడు.

'పిచిచారట' అన్నాడు ప్రసాదరావు సౌమ్యంగా.

'ఔను. చూడండీ. నాకు చీఫ్ ఇంజ నీర్ దగ్గరనుంచి లెటర్ వచ్చింది. ఈ సమ్మర్ పూర్తయ్యేవరికి చాలా వర్క్ పూర్తి కావాలట. డిసెంబర్‌లో బ్రిడ్జి ఎట్టి పరిస్థితులలోను ఓపెన్‌కాక తప్పదుట. మనం ఇంకా నాలుగు పిల్లర్సు పూ చేయాల్సి ఉంది. అంతవరకు స్లేబ్‌వర్ ప్రారంభించలేం. ఎలాగో నాకేం పాలి పోవడం లేదు' అన్నాడు గజపతి ఓ నిర్ణ యానికి రాలేకపోయినట్టు ముఖం పెట్టి.

ప్రసాదరావుకి ఉద్యోగంలో చేరిన కొత్తరోజులు కావడంతో ఏదో చేసెయ్యా లన్న తహ తహ వుండేది. దాంతో దాని దేముందండి! సి. యి. యే త్వరగా పని పూర్తి కావాలంటున్నారు కాబట్టి, బిల్సు ఆలశ్యం కావు. గోడౌన్సునిండా కావలసి నంత మెటీరియల్ వుంది. యింక లేబర్ సంగతేకదా? మన కూలీజనానికి పని దొరక్కపోవడం సమస్యగాని, పనుంటే కూలీలు దొరక్కపోవడం అనే సమస్య మనకి లేదుకదా. పనిస్తామంటే చేసే జనం కోకొల్లలు రేపటినుంచి మరో పిల్లర్ దింపడానికి ఏర్పాటు చేద్దాం' అన్నాడు ప్రసాదరావు హుషారుగా.

'సరే అయితే. మన కనకయ్యతో చెప్పి మరో వందమంది కూలీలను పెట్టించండి. పిల్లర్ దింపాలంటే యీ పాయ ప్రవాహాన్ని అటు మళ్ళించాలిగా ముందు' అన్నాడు గజపతి.

అంతలో కనకయ్య అక్కడకు వచ్చి 'దండాలు బాబుగారు' అన్నాడు.

'మాటలోనే వచ్చాడు మన కనకయ్య' అన్నాడు అప్యాయాన్ని చిరునవ్వులో రంగరించి పెదవులపై చిలికిస్తూ.

'యేం కనకయ్యా! పనిమీ దొచ్చావా యేటు' అన్నాడు ప్రసాదరావు.

'ఔను బాబూ! గజపతిబాబుగారితో ఓ మాట సెప్పుకుందావని....' అంటూ నసి గాడు కనకయ్య.

'చెప్పు కనకయ్యా?' అన్నాడు గజ పతి వరాలిచ్చే దేవుడిలా.

'మన పనిలో నిరుడు పనిచేసిన పుల్లయ్య లేడండీ....'

'వుండే వుంటాడులే. ఊఁ ఏమిటో చెప్పు.'

'పదకొండో తంబానికి సిమెంటు సేసే టప్పుడు పరంజా బొంగిరిగి పడిపోనాడు కదండి. ఆడికింక కాలు రాదు పొమ్మన్నా రట ఆసుపటాలునుంచి. అవిటోడుకందా డింక కాత్త మన కాడనే యేదో దారి సూపిత్తే బాగుంటదని తమకి మనవిసేసు కుందావని వచ్చానండి.'

'కాలు అవిటిగాని, చేతులూ, కళ్లూ వున్నాయిగా. పోనీ రమ్మను. మన గో డౌన్ దగ్గర వాచ్‌మన్‌గా పడుంటాడు' అన్నాడు గజపతి.

కనకయ్యకి చాటంత ముఖమైంది. దండాలు బాబు! మీ పేరు ఆడు సచ్చే దాకసెప్పుకుంటాడు' అన్నాడు కనకయ్య సంతోషంగా.

దూరంగా నిలబడిన పుల్లయ్యని దగ్గ రకు రమ్మని చెయ్యూపి 'బాబుగారికి దణ్ణం పెట్టుకోరా సన్నాసి. నీకు పని ఛ్చారు మల్లా' అన్నాడు కనకయ్య.

పుల్లయ్య కళ్ళు కృతజ్ఞతతో చమ్మ గిల్లాయి. గజపతి కాళ్ల మీద పడబోయాడు.

'చాల్చాల్లే, వెళ్లు. గోడౌన్‌దగ్గరుండు పో' అంటూ దూరంగా తొలిగి, సిగరెట్ ముట్టించి, 'చూడు కనకయ్యా! రేపటి నుంచి మరో వందమంది కూలీలని పిలు చుకు రావాలి. కొత్త పిల్లరు మొదలెట్టాలి. మరి ప్రవాహానికి అడ్డు కట్టి ఆటు మళ్ళిం చాలిగా' అన్నాడు గజపతి.

'కాని యీడ వడెక్కువగదా అడ్డా గుడ్డా లేదోఁ?'


'నీ కెందుకా భయం? మన యింజ నీరుగారంటే సామాన్యులనుకున్నావా? ఆయన కళ్లెర్ర చేస్తే సముద్రం కూడ దడుస్తుంది' అన్నాడు గజపతి.

ప్రసాదరావు భుజాలు అంగుళం పొంగాయి.

మర్నాడు అదనంగా వందమంది కూలీలు పనిలో కొచ్చారు. యిసుకబస్తాలు మోసుకొచ్చి నీళ్ళల్లోకి వేస్తున్నారు. కాని వడి ఎక్కువగా ఉండటంతో ఓ చోట బస్తా వేస్తే మరో చోటికి కొట్టుకుపో తోంది.

ప్రసాదరావు కేమీ తోచలేదు. చివరికి బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

'ఒక పడవని యిసుకబస్తాలతో లోడ్ చేసి ముంచేస్తేకాని లాభం లేదండి' అన్నాడు ప్రసాదరావు కాంట్రాక్టరు గజ పతితో,




'అయితే ఓ ఓటి పడవని కొని అల్లాగే కానివ్వండి'' అన్నాడు గజపతి.

పడవను తెప్పించారు. యిసుకబస్తాలతో నింపారు. యింక నాలుగైదుబస్తాలు పడవలో వేస్తే పడవ మునుగుతుంది. యింక జనం దగ్గరకు వెళ్ళడానికి భయపడుతున్నారు.

ఎవరూ దగ్గరకు వెళ్ళకపోవడం చూసి "ఏమిటి కనకయ్యా! యిలాంటి పిరికి వాళ్ళని తెచ్చావు. యిదేవన్నా మెరక పొలంలో కలుపుతీతా? నీళ్ళలో పని. చేపల్లా చొచ్చుకుపోవాలిగాని అలానిలబడి గుడ్లప్పగిస్తే పనెల్లా అవుతుంది? ఊఁ కానివ్వండి' అని అధమాయించాడు గజపతి.

'ప్రాణాలతో పని కదాండి. అందుకనీ' అన్నాడు కనకయ్య.

"నేనొత్తున్నా వుండండయ్యా'అంటూ ఓ బస్తా నెత్తికెత్తుకుని కాలు దెక్కుకుంటూ ముందు కొచ్చాడు పుల్లయ్య.

'అది! అలా వుండాలి. కుంటాడైనా ఆడికున్న గుండె మీ కెవరికీ లేదు. వనంచే ఏనుగుగున్నలా పరుగెడతాడు పుల్లయ్య' అంటూ హుషారు చేసాడు గజపతి.

యజమాని మెప్పు వెనకవున్నస్వార్థం

తెలియలేదు పుల్లయ్యకి. తనకి ఓ కాలు అవిటిదే అయినా, పనికొస్తానని రుజువు చేసుకోవాలన్న తహతహ పుల్లయ్యని గుడ్డివాడిని చేసింది. పుల్లయ్య చక్క మీంచి పడవెక్కుతున్నాడు.

'పుల్లయ్యా, పుల్లయ్యా! సత్తావురా' అంటూనే వున్నాడు కనకయ్య.

పుల్లయ్య పడ వెక్కాడు. తూలాడు. నెత్తిమీద బస్తా తూలి గుండెలమీదకు జారింది. తూలి పడిపోయాడు పడవమీద. యిసుకబస్తా గుండెల మీద పడింది. కావాలని తాపత్రయపడ్డాడు. కాని పులయ్య బరువుతో, అ బస్తా బరువుతో పడవ అప్పటికే మునగడం ఆరంభమింది. పడవ మునిగి పోయింది, జనం అటూ యిటూ కంగారుగా గంతులేసారు. గజపతి నిశ్చలమైన మనసుతో కంగారు నటించాడు. లాభం లేకపోయింది.

పుల్లయ్య తేల్లేదు,

పుల్లయ్య మునిగిపోయినందుకు కూలీలు తల్లడిల్లిపోయారు. కనకయ్యకళ్లు చెమ్మగిల్లాయి. తను పుల్లయ్యకి మళ్ళీ పని యిప్పించింది పుల్లయ్యను యీ గోదావరికి వప్పచెప్పడానికే కామోసను కున్నాడు.

ప్రసాదరావు కొత్తగా వుద్యోగంలోకి చేరినవాడు కావడంతో తన కళ్ళముందు జరిగిన సంఘటనని తట్టుకోలేక విలవిల్లాడేడు.

యిదంతా గమనించిన గజపతి పని ఆగిపోయేలా వుందనుకుని, 'యిలాంటి మహా కార్యాల్లో యిలాంటి త్యాగాలు, సాహసాలు తప్పవు మరి. పుల్లయ్య ధన్యుడు. గొప్ప త్యాగి. పదిమందికి వుపకరించే పనిలో తన ప్రాణాల్నే త్యాగం చేసాడు' అన్నాడు గొప్ప రాజకీయ వేత్తలా.

అంతా నిశ్శబ్దంగా వుండి పోయారో నిముషం.

గజపతికి కావలసింది పుల్లయ్య కోసం సంతాప సభకాదు పని త్వరగా పూర్తి కావడం.

'అతని ఆత్మకి శాంతి దొరకాలంటే మనం యీ పనిని త్వరగా పూర్తి చెయ్యాలి. ఊ., కానివ్వండి' అన్నాడు గజపతి. కాదనలేక, పుల్లయ్య మనశ్శాంతి కోసమని, 'కానివ్వండి' అన్నాడు అమాయకుడైన కనకయ్య కూడ.

పని వేగంగా జరుగుతోంది.

'త్యాగం!' అనే పదాన్ని కనిపెట్టిన వాడు గొప్ప మేధావై వుండాలి అనుకున్నాడు గజపతి.

కట్ట పూర్తయింది. తన తెలివి సాధించిన గెలుపుకి ప్రసాదరావు మురిసి పోయాడు. తన యుక్తి, సమయస్ఫూర్తి తెచ్చిన విజయానికి గజపతి మీసాన్ని దువ్వుకుంటూ చిరునవ్వు నవ్వాడు.

ఇక పిల్లర్ పని ప్రారంభం కావాలి.

ముప్పై ఆడుగుల పొడవు పదిహేనడు గల వెడల్పున, దాదాపు నలభై అడుగుల లోతుగల గొయ్యి తియ్యాలి. ఆ గోతికి చుట్టూ సెంటరింగ్ కట్టి డ్రిల్స్ అమర్చి కాంక్రీట్‌తో నింపాలి.

గొయ్యి తియ్యడం ప్రారంభించారు. నాలుగైదడుగుల గొయ్యి తీసేసరికే!చుట్టూ నీరుండడంతో మొలలోతు నీళ్ళు వూరాయి. వూరిన నీటిని యింజను తోడుతూ వుంటుంది. కాని గొయ్యి యింకా లోతు కెళ్ళేసరికి మనిషి నీళ్ళలో మునిగి మట్టి తీయాల్సొస్తుంది, నదుల్లో కట్టే ప్రతి స్థంభానికి యిదేపద్ధతి.

వీళ్ళలో మునిగి మట్టి తీయడం అంద రికీ చేతనైన పనికాదు కేరళనుంచి వచ్చిన పిళ్ళె, శంకర్, తంబి మాత్రమే ఆపనిలో నిపుణులు. వాళ్ళు ముగ్గురూ మరో స్థంభం దగ్గర పనిచేస్తున్నారు. యీ స్థంభం పని ప్రారంభించాలంటే వాళ్ళ లాంటి వాళ్లే మరో ముగ్గురో యిద్దరో కావాలి.

గజపతి శంకర్‌ని, పిళ్లేని తన టెంట్‌కి పిలిపించాడు.

'పిళ్లే! బ్రిడ్జి త్వరగా పూర్తి కావా లని మనకి పైనుంచి ఆర్డరు వచ్చింది! అంచేతనే మరో స్థంభం పని కూడా ప్రారంభించాం. మీరు కాస్త కష్టపడితే పని త్వరలో పూర్తవుతుంది.'

'యిప్పుడు పని చేస్తూనే ఉన్నాంగా సార్! ఆ స్తంభం పని వదిలి యీ స్థంభాని కొస్తే ఆ స్థంభం పని ఆగిపో తుంది సార్' అన్నాడు శంకర్.

'అదికాదు నేననేది. యిప్పుడు పగలు మాత్రమే పనిచేస్తున్నారు. యీ స్థంభం పని రాత్రిపూట మీరు చేస్తే, దానికి తగిన ప్రతిఫలం మీకు నేను ముట్టచెబుతాను. నా మాట కాదనక యీపేళ నుంచి రాత్రిళ్ళు యీ స్థంభంపని మొదలెట్టండి' అన్నాడు గజపతి.

'రాత్రింబవళ్ళు యీ పని చెయ్యడం కష్టం సార్! మాస్క్ తగిలించుకొని ఆక్సి జన్ సిలిండర్ భుజాన వేసుకుని, నీళ్ళల్లో మునిగి మట్టి తియ్యడం అంటే, ప్రాణా లతో చెలగాటంసార్! రాత్రిళ్ళైనా రెస్టు లేకపోతే కష్టం సార్. పైగా నీళ్ళలో వున్న వాళ్ళ ప్రాణాలు గంట మోగగానే పైనుండి యింజను నడిపేవాడి చేతుల్లో వుంటాయి ఒడ్డునవున్న మనిషి కునుకు పాట్లు పడితే గోతిలో వున్నవాళ్ళ పని గోతిలోనే' అన్నాడు పిళ్ళే.

'మీ కష్టం నాకు తెలియంది కాదు పిళ్లె. యిన్నాళ్ళు అనుభవమున్న మీరే యిలా జంకితే ఎలా? అంత దూరంనించి మీ రొచ్చినందుకు వీలైనంత ఎక్కువ డబ్బు మీకే ముట్టచెబుదామనీ, త్వరగా పని పూర్తి చేయిద్దామనీగాని, మీలాంటి జనం నాకు దొరక్క? కాకపోతే నాలుగు రోజులు ఆలశ్యం అవుతుందిగాని'అన్నాడు గజపతి, పిళ్లె కాదనలేనంత మెత్తగా, చనువుగా.

పిళ్లేకి తనకున్న అవసరాలు గుర్తు కొచ్చాయి. సేనిటోరియంలో అతని భార్య, చదువుకుంటోన్న కొడుకు, మిగిలిన పిల్లలు మనస్సులో మెదిలారు. తనకి డబ్బవసరం. వచ్చిన అవకాశాన్ని వదలు కోకూడదనుకున్నాడు.

'సరేనయ్యా! రాత్రినుంచే పని మొద లెడదాం' అని గజపతికి మాటిచ్చి. 'కష్ట పడందే డబ్బెట్లా వస్తుంది, శంకర్? నేనున్నానుగా నీ కెందుకు? సరే అను' అన్నాడు పిళ్లే.

శంకర్ కాదనలేక, సరే నన్నట్టుగా మౌనంగా వూరుకున్నాడు.

ఆ రాత్రి నుంచే పని అనుకున్నట్టుగా ప్రారంభమయింది. గజపతి అనుకున్న ప్రకారం పని సాగుతోన్నందుకు చాలా వుల్లాసంగా వున్నాడు. ప్రసాదరావు కష్ట పడి రాత్రింబవళ్ళు పని నంతటినీ జాగ్రత్తగా సూపర్‌వైజ్ చేస్తున్నాడు.

ప్రసాదరావు యిచ్చిన కొలతల ప్రకారం గొయ్యి తవ్వడం మొదలెట్టారు కొంత లోతుకు వెళ్ళింది. యింజను వూరిన నీటిని తోడుతోంది. ఎంత నీరు తోడినా, చుట్టూ నీరుండడంతో. తోడినంత వేగంగా రలానీరు గోతి లోకి వూ రు తూ నే వుంది.

గొయ్యి బాగా లోతుకెళ్ళింది. గోతికి అడ్డంగా నాలుగైదు బలమైన యినుప కమ్ములు వేసారు. దాని మీద యింజను అమర్చారు. రెండు కప్పీలకి యినుప తాడు తగిల్చివుంది. యినుపతాడుకి ఒక చివర ఒక తొట్టె కట్టబడివుంది.

గోతిమీద యినుప కమ్మెలమీదున్న యింజన్ ముందు కూర్చున్న కనకయ్యె




ఆశ

పాట్ పాన్

★ భారతదేశంలో మొట్టమొదటిది.
గంటకు 300 నుండి 400 పూరీలు.
భకారీలు చెయ్యవచ్చు.

ఐ. బి. ఇండస్ట్రీస్
నవసారి (గుజరాత్)

IBIS

ADROIT/IB/96

స్విచ్ నొక్కితే తొట్టి సీటిలోకి దిగుతుంది నీళ్ళలో వున్న పిళ్లే, శంకర్. మట్టితో తొట్టినినింపి: నీళ్ళలోకి వేళాడుతోన్న ఓ సన్నని తాడు లాగ్గానే పైన ఓ గంట మోగుతోంది. గంట మోగగానే కనకయ్య మళ్ళీ స్విచ్ ఆన్‌చేస్తున్నాడు. నీళ్ళలో నుంచి మట్టితో నిండిన తొట్టె బయట కొస్తోంది. తొట్టిలో వున్న మట్టిని ఒడ్డున గుమ్మరించి మళ్ళీ తొట్టిని గోతిలోకివదులు తున్నారు యిద్దరు పనివాళ్ళు.

లోపలుండి పనిచేసేవాళ్ళు అలసిపోయి నప్పుడు అంటే ప్రతి అరగంటకి ఓసారి అదే తొట్టెలో కూర్చుని పైకొచ్చి, పది నిముషాలు రెస్టుతీసుకుని మళ్లీ గోతిలోకి దిగి పని ప్రారంభిస్తున్నారు. శంకర్ పిళ్లేగాని తొట్టిలోకి ఎక్కినప్పుడు కూడ అలాగే గంట మోగిస్తున్నారు. గంట మోగగానే స్విచ్ ఆన్ చేస్తే ఒడ్డుకు వచ్చే వారు.

ఇనుపకమ్మిల మీద కూర్చుని ఇంజన్ ఆపరేట్ చేసే అతను చాలా జాగ్రత్తగా వుండాలి. గంటమోగగానే స్విచ్ ఆన్ చెయ్యకపోతే లోపల పని చేసేవాళ్ళకి ప్రమాదం.

పగలుపనిచేసే ఆ యింజన్ డ్రైవర్ రాత్రిపూట పని చేయలేననడంతో గజపతి నమ్మిన బంటైన కనకయ్యకి ఆ పని తప్ప లేదు. పగటి పూట మామూలు మోటపని, రాత్రిపూట యింజన్ నడపడం కనకయ్యకి తప్పని పనులయ్యాయి.

పిళ్లే, శంకర్, తంబి చాలా పట్టు దలతో పని చేస్తున్నారు ఒక వారం రోజుల్లో పిల్లర్ దాదాపు దిగవలసినంత లోతూ దిగింది. యింకొక్క అడుగు దిగాలి.

వారం రోజులనుంచి ఆ పనిలో వున్న ఎవ్వరికీ నిద్రలేదు. పని లొంగుతోన్న కొద్దీ మరీ హుషారుగా పట్టుదలగా పని చేస్తున్నారు వాళ్లు.

ఆ రాత్రి శంకర్‌పిళ్లె నీళ్ళలోకిదిగారు. తంబి ఒక గంటలో వస్తానని తనపాక దగ్గర కెళ్ళాడు. చాప మీద కూర్చుని బీడీ ముట్టించాడు. బీడీ కాలుతూనే వున్నా అతనికి నిద్దర ఆగక అల్లాగే చాపమీద ఒరిగాడు. నిద్దర పట్టేసింది

యింజన్ ముందున్న కనకయ్య యాంత్రికంగా గంట మోగి నప్పుడల్లా స్విచ్‌ఆన్ చేస్తున్నాడు: మట్టో మనుషులో తొట్టెలో పైకి వస్తున్నారు. మళ్ళీ తొట్టె మనుషులతోటో, ఖాళీ గానో గోతిలోని నీళ్ళలో మునుగుతోంది.

కనకయ్య కునికిపాట్లు పడుతున్నాడు. కూర్చుని చేసేపని కావడంతో ఎంత ఆపు కున్నా అతనికి నిద్ర ఆగటంలేదు.

ఇంతలో గంట మోగింది. స్విచ్ నొక్కబోయాడు కనకయ్య. కళ్ళు మూసు కునే. ముందుకి తూలిపోయాడు. నీళ్ళలో పడిపోయాడు. గంట మోగించింది లోప లున్న పిళ్లే, శంకర్ బయటకి రావడం కోశం. పైనుండి మట్టిని తొట్టిలోంచి

గుమ్మరంచే యిద్దరు పనివాళ్లు కంగారు పడ్డారు. వాళ్ళ ఆ యింజన్ ఆపరేట్ చేయడం తెలీదు. గజపతి కోసం పరుగెత్తారు, గజపతిని లేపుకొచ్చేసరికి గోతి లోని నీళ్లు నిశ్చలంగా వున్నాయి, ప్రసాద రావుకి కబురంది పరుగెత్తుకొచ్చాడు. తంబీ యీ గొడవకి లేచి పరుగెత్తుకొచ్చాడు. స్విచ్ ఆన్ చేసాడు. నిశ్చలంగా వున్న నీళ్ళ లోంచి కాళీ తొట్టె బయిట కొచ్చింది.

'శంకర్' అంటూ ఒక్కగావు కేక పెట్టి చేతుల్లో ముఖాన్ని దాచుకున్నాడు తంబి.

గజపతి పని ఆగిపోయిందేనని ఒక్క నిట్టూర్పు విడిచాడు.

'రూపాయి కోసం హత్య చేయడానికి కూడ కావలసినంతమంది దొరికేటంత పేదరికం వుంది యీ దేశంలో అన్నాడట వెనకటికి ఓ విదేశీయుడు. కాని ఒక లక్ష వున్నవాడు మరో లక్షకోసం నిలువునా ఎన్ని ప్రాణాలైనా తియ్యగలిగేవాళ్ళున్నారీ దేశంలో అని అతనికి తెలీదనుకుంటాను' అనుకున్నాడు గజపతిని చూస్తూ.

ఇంతలో కారుహారన్ మోగింది, అదే బస్సు బాగైంది. జనం ఎక్కుతున్నారు. బ్రిడ్జి మీదున్న ప్రసాదరావు వెనక్కి తిరిగి బస్సు దగ్గర కొచ్చాడు. బస్సు ఎక్క బోతూ ఒక్కసారి వెనక్కి తిరిగి బ్రిడ్జి వైపు చూసాడు.

నిగనిగలాడుతూ కుడివైపున ఎడంవైపున రెండు పాలరాళ్ళగుపించాయి. వాటిమీద బంగారుపూత పూసిన అక్షరాలు మెరుస్తున్నాయి. అక్షరాలను పరకాయించి చూసాడు ప్రసాదరావు.

మనుషుల పేర్లు....

కాని అక్కడున్న పేర్లు.... మెరుస్తోన్న పేర్లు.

కుంటికాలుతో అడ్డు నిలబెట్టడానికి ప్రాణాలొడ్డిన పుల్లయ్యది కాదు -

పని తొందరగా పూర్తి కావాలని రాత్రింబవళ్ళు పనిచేసి గోతిలో ప్రాణాలొడ్డిన శంకర్, పిళ్లే, కనకయ్యలవి కావు-

ఆ బ్రిడ్జి కట్టడానికి వెండి తాపీతో మెత్తని సిమెంటును పామివేయి చేతులతో చప్పట్లు కొట్టించుకుని, మెడ మోయలేనన్ని దండలు వేయించుకొని, బ్రిడ్జి పూర్తయ్యేదాకా ఆ ప్రాంతానికిరాని ఓ మహావ్యక్తి పేరు ఓ పాలరాతి మీద.

బ్రిడ్జి పూర్తికాగానే వెండి కత్తెరతో మెత్తని పట్టురిబ్బన్‌ను కత్తిరించడానికిని శ్రమపడిన మహామనిషి పేరు మరో పాలరాతిమీద అగుపించాయి ప్రసాదరావుకి!

౦౦౦